





# మదుపుతోనే గెలుపు









## ద్రవ్యసమీక్షపైనే..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**మార్కెట్ పల్స్**

*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*



**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్చేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

**ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు**

ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

**క్రిప్టో సిప్స్**

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

**గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్**

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.



## 'పది' విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

కంఠేశ్వర్, జూన్ 1 : గోసంగి, బేడ బుడ జంగం కులాలకు ప్రాధాన్యత కల్పించడానికి బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి,భూపతిరెడ్డి చొరవ చూపాలని గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాజేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా టీఎన్జీవోస్ భవన్‌లో గోసంగి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బుచ్చన్న, లక్ష్మణ్, గంగయ్య, వీరేశం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన



అబ్జర్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఖలీల్‌వాడి, జూన్ 1 : ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నూతన అధ్యాపకులకు రావాల్సిన 2వ వార్షిక ఇంక్రిమెంట్ రాకుండా కొందరు చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ఈ నెల ఒకటి నుంచి నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఇంటర్ మూల్యాంకన కేంద్రాల వద్ద అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపడుతున్నట్లు రాష్ట్ర గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, విజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం బోర్డు నుంచి వచ్చిన అబ్జర్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

## పాకిస్తాన్‌కు వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి/వినాయక్‌నగర్, జూన్ 1 : కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్‌కు వతాసు పలికేలా మాట్లాడుతున్నారని బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న మున్నూరుకాపు సంఘంలో తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, ఇంటర్, పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్ష్మణ్ హాజరయ్యారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కులగణన పై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉద్దేశ పూర్వకంగానే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

## ఉమ్మడి జిల్లా జూనియర్ మెన్, ఉమన్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కంఠేశ్వర్/ మాక్లూర్, జూన్ 1 : రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామరి పవన్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కల్లెడ జడ్పీహెచ్‌ఎస్‌లో ఉమ్మడి జిల్లా జూనియర్ మెన్, ఉమెన్ హ్యాండ్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించినట్లు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షుడు గంగాహోన్ చక్రు తెలిపారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి నక్రీడాకారులు రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా లో ఈ నెల 4 నుంచి 6 వరకు నిర్వహించనున్న 47వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ మెన్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సురేందర్, రాజేశ్, రమణ, మాధురి, సంజీవ్, సాయి, రాహుల్ విష్ణు, సాయి, శ్రావణిత్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట, జూన్ 1: మండల కేంద్రంలో ఓ బంక్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ వైర్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యు త్ వైర్ తగిలి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నవీపేటలో భారతి పెట్రోలియానికియంకు సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్‌కు సంబంధించిన వైర్ మరమ్మతుల కారణంగా బంక్ మేనేజ ర్ స్టేషన్ ఏరియాకు చెందిన సాయిలును మరమ్మతుల కోసం తీసుకు వచ్చాడు. సదరు ప్రైవేటు హెల్పర్ ఎల్‌సీ తీసుకోకుండా ట్రాన్స్‌ఫార్మ ర్ ఎక్కి వైర్‌ను మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు వైర్ తగిలి సాయిలు, కాలుకు, చేయికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికు లు నిజామాబాద్ ప్రైవేట్ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక ఏఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఉత్తమ సేవలకు గుర్తింపు

### పలువురు పోలీసు సిబ్బందికి సేవా పతకాలు

వినాయక్‌నగర్, జూన్ 1: నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణలో చేసిన సేవలకు గుర్తింపు లభించింది. డ్యూటీలో సేవలు అందించిన, ఉత్తమ సేవలు కనబర్చిన సిబ్బందికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా పతకాలను ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవీందర్ గుప్త ఆదివారం జాబితా విడుదల చేశారు. సీసీఎస్(సెంట్రల్ క్రైమ్ స్టేషన్)లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న పి.రవీందర్‌కు మహోన్నత సేవా పతకంతోపాటు రూ.40వేలు రివార్డు సైతం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. రుద్రూర్ ఎస్సై పి.సాయన్నకు ఉత్తమ సేవా పతకం ఇవ్వనున్నారు. మరో 35 మంది సిబ్బందికి సేవా పతకాలను ప్రకటించారు. 2026 జనవరిలో పతకాలను అందజేయనున్నట్లు సమాచారం.

## వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి



దీక్ష చేస్తున్న జేఏసీ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్, జూన్ 1: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ అహమ్మద్ అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టసవరణ బిల్లు భారత రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌చట్ట సవరణ బిల్లును రద్దు చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వం



టీయూసీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకుడు

ఖలీల్‌వాడి, జూన్ 1 : పదకొండేండ్ల మోదీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని టీయూసీఐ నాయకులు అన్నారు. దేశ చరిత్రలో గత ప్రభుత్వాల కన్నాఎక్కువగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించింది మోదీ ప్రభుత్వమేనని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఉప్పు, పప్పులు, మంచినూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి మధ్యతరగతి ప్రజల వినియోగ వస్తువులు, రోగుల మందు గోళీలపై చివరికి చదువుకునే పిల్లలు వాడే పెన్సిల్, చాక్‌పీస్ లాంటి వస్తువులపై కూడా ట్యాక్స్‌లు వేస్తుందన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ఎన్ఆర్ భవన్‌లో టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభను ఆదివారం నిర్వహించారు. ముందుగా టీయూసీఐ జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న ఆవిష్కరించారు. కార్మికోద్యమంలో అమరులైన వీరులను స్మరిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన బాధ్యత కార్మికవర్గం పైనే ఉందని పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ రంగాల కార్మికుల శ్రేయస్సు కోసం మరింత బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, సుధాకర్, వెంకన్న, రాజేశ్వర్, మల్లేష్, విఠల్, కిరణ్, రాజేశ్వర్, రెహనా, గణేశ్, సాయన్న, గంగాధర్, సాయిబాబా, నాగమణి, లింగం, రవి, చరణ్, రమేశ్, గంగాధర్, శివకుమార్ పాల్గొన్నారు.

## ఇంగ్లిష్ అధ్యాపకురాలు మృతి

ఖలీల్‌వాడి, జూన్ 1 : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకురాలుగా పని చేస్తున్న స్వర్ణ అనారోగ్యంతో హైదరాబాద్‌లో దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. నిజామాబాద్ మూల్యాంకన కేంద్రంలో ఆమె చిత్రపటానికి డీఈవో రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మంచి అధ్యాపకురాలిగా గుర్తింపు తెచ్చుకున్న స్వర్ణ అకాల మరణం తీరని లోటని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు నర్సయ్యతోపాటు పలువురు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు.



శక్కర్‌నగర్, జూన్ 1: బోధన్ పట్టణంలో ఆదివారం సాయంత్రం తిరంగ ర్యాలీ నిర్వహించారు. యువకులు జాతీయజెండాను పట్టుకుని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని సిందూర్ ఆపరేషన్ విజయవంతమైన నేపథ్యంలో.. భారత సైనికులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ర్యాలీ నిర్వహించారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

కంఠేశ్వర్, జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్యఅతిథిగా హాజరై, జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరుల ముఖ్యఅతిథులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో లోటుపాట్లకు తావు లేకుండా పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

## పెగడాపల్లిలో నిలిచిన బాల్య వివాహం

శక్కర్‌నగర్/ బోధన్ రూరల్, జూన్ 1: బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ఆదివారం జరగనుందన్న సమాచారం మేరకు ఐసీడీఎస్ అధికారులు ఆ గ్రామానికి వెళ్లి ఆ బాల్య వివాహాన్ని ఆపారు. బాల్య వివాహం చేయాలనుకున్న బాలిక, బాలుడి తరపు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. కౌన్సెలింగ్ ఇచ్చినవారిలో సోషల్ వర్కర్ పద్మాసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఐసీడీఎస్ టీమ్ సౌజన్య, సాయిలు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

వినాయక్‌నగర్, జూన్ 1: నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం రైల్వే స్టేషన్ మేనేజర్ హరికృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు నిజామాబాద్, డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ మధ్య మాధవనగర్ వద్ద సుమారు 45ఏండ్ల వయస్సు గల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి ముంబై వైపు ట్రైన్ వెళ్తుండగా పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడికి సంబంధించి ఏదైనా సమాచారం తెలిసినవారు రైల్వే ఎస్సై 87126-58591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## మెడికల్ టెస్టుకు కోసం వెళ్లిన వ్యక్తి మృతి

నవీపేట, జూన్ 1: బతుకు దెరువు కోసం గల్ఫ్ వేళ్లేందుకు గాను హైదరాబాద్‌లో మెడికల్ టెస్టు కోసం వెళ్లి రెండు రోజుల క్రితం కన్పించకుండా పోయిన ఓ వ్యక్తి వికారాబాద్ సమీపంలో రైలు పట్టాలపై ఆదివారం శవమై కన్పించాడు. స్థానికుల కథనం ప్రకారం నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కొండపల్లి శ్రీనివాస్ గత నెల 27 న గల్ఫ్ దేశం వెళ్లేందుకు గాను హైదరాబాద్‌కు మెడికల్ టెస్టు కోసం వెళ్లి కన్పించకుండా అదృశ్యమై పోయాడు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య రూప ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదైంది. కాగా అదృశ్యమైన శ్రీనివాస్ వికారాబాద్ సమీపంలో ఉన్న రైలు పట్టాలపై శవమై కనిపించాడని అక్కడి పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం అందిందని నవీపేట ఏఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మృతికి గల కారణాలు పోస్టు మార్టం అధారంగా తెలుస్తాయని అన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి ..

భీమ్‌గల్, జూన్ 1: భీమ్‌గల్ పట్టణంలో ఆదివారం ట్రాక్టరు బోల్తా పడ్డ ఘటనలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన కూలీ దీపక్ గిరి (23) దుర్మరణం పాలయ్యాడు. స్థానిక ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభాలను లోడ్ చేసుకుని చేంగల్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో ట్రాక్టర్ డ్రైవర్ శుభాంకర్ కర్మకర్ అతివేగంగా నడుపడంతో ట్రాక్టర్ డివైడర్‌కు ఢీకొని బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న కూలీ దీపక్‌గిరి కింద పడగా, అతడిపై విద్యుత్ స్తంభాలు పడడంతో తలకు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.